అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ఆధ్యాత్మిక వికాసం... ఆర్థిక న్యాయం

**మేము ఇస్రాయీలు సంతానం నుండి మరొక వాగ్దానం తీసుకున్నాము. దానిని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి: "అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రులను, బంధువులను, అనాథులను, నిరుపేదలను ఆదరించాలి. ప్రజలను సహృదయంతో పలుకరించాలి. నమాజును స్థాపించాలి. జకాత్ ఇవ్వాలి." (అల్ బఖర : 83)**

దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యం జకాత్ చెల్లించాలని స్పష్టంగా ఆదేశించిన వాక్యం. జకాత్ అంటే విధిగా ఇవ్వవలసిన దానం. విధిదానం అని మనం అనువదించుకోవచ్చు.

ఈ ప్రపంచంలో ఏదీ మనది కాదు. ప్రపంచంలో కొంతకాలం ఉండడానికి మాత్రమే మనిషి వచ్చాడు. తిరిగి తన ప్రభువు, సృష్టికర్త వద్దకే మరలిపోవలసి ఉంటుంది. ఈ లోకంలోకి వచ్చినప్పుడు తన వెంట ఏదీ తీసుకురాలేదు. వెళ్ళేటప్పుడు ఏదీ తీసుకువెళ్ళడు. మధ్యకాలంలో సంపాదించినది ఏదీ కూడ నిజానికి మనిషిది కాదు. అన్నీ దైవప్రసాదితాలే. మనది ఏదీ కాదన్న వాస్తవాన్ని మనిషి గుర్తించి, తనకు లభించినదాన్ని ఇతరులతో పంచుకోవాలి.

అలాగే ఈ ప్రపంచంలో మన హెూదా పదవి ప్రతిష్ఠలేవీ నిజానికి మనం స్వంతంగా సాధించినవి కావు. గౌరవమర్యాదలనేవి కూడా మనం స్వంతంగా సాధించుకున్నవి కావు. మన ప్రయత్నాలు ఇందులో తప్పక ఉండవచ్చు. ప్రయత్నించిన ప్రతి ఒక్కరికి కోరింది లభించదు. దైవం ఎవరికి ఇవ్వాలనుకుంటాడో వారికే లభిస్తుంది. కాబట్టి దైవాదేశాలకు తలవంచడమే మనిషి కర్తవ్యం అన్నది గ్రహించాలి.

మనది ఏదీ ఇక్కడ లేనప్పుడు, నా ఆస్తి, నా సంపద, నా బ్యాంక్ బ్యాలెన్స్... వగైరా నాది, నా స్వంతం అనే మాటలే అర్థంలేనివని గ్రహించినప్పుడు, ప్రాపంచిక సంపదల పట్ల వ్యామోహం అంతరిస్తుంది. పేదసాదలను కూడా తనతో సమానంగా గుర్తించి ఆదుకోవడం అలవడుతుంది. నిజానికి ఆదుకుంటున్నది ఆ దైవమే... కాకపోతే మన ద్వారా ఆ పని చేయిస్తున్నాడన్న జ్ఞానం మనిషిలో వినయాన్ని, వినమ్రతను పెంచుతుంది.

జకాత్ చెల్లించడం వల్ల మనిషి సంపద పరిశుద్ధమవుతుంది. కాని గుర్తుంచుకోవలసిన వాస్తవమేమిటంటే, కేవలం ధర్మసమ్మతమైన పద్ధతుల్లో సంపాదించిన సంపద మాత్రమే పరిశుద్ధమవుతుంది. అధర్మంగా సంపాదించిన సంపదను జకాత్ పరిశుద్ధపరచడం జరగదు. అధర్మంగా సంపాదించిన సంపద అధర్మమే... దానికి శిక్ష దైవసన్నిధిలో తప్పదు. జకాత్ పరిశుద్ధపరిచే సంపద కేవలం ధర్మసమ్మతంగా సంపాదించిన సంపద మాత్రమే అన్నది గుర్తుంచుకోవాలి. అధర్మ పద్ధతుల్లో సంపాదించడం అనేది సంపద పట్ల వ్యామోహం వల్ల జరుగుతుంది. జకాత్ సంతోషంగా చెల్లించే వ్యక్తిలో సంపద పట్ల వ్యామోహం ఉండదు. సంపద పట్ల వ్యామోహం లేని వ్యక్తి కేవలం ధర్మసమ్మతమైన మార్గాల్లోనే సంపాదిస్తాడు. ఇలాంటి వ్యక్తులే అత్యుత్తమ సమాజాన్ని స్థాపిస్తారు.

జకాత్ విషయంలో అల్లాహ్ స్పష్టమైన ఆదేశాలు తన గ్రంథంలో ఇచ్చాడు. అవి:

**"కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చు చేసేవాని మాదిరిగా అల్లాహ్‌ను అంతిమదినాన్నీ విశ్వసించని వాని మాదిరిగా, మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దాన ధర్మాలను మట్టిలో కలపకండి."**

**(అల్ బఖర : 264)**

**"విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దానిలోని మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వటానికి పనికిరాని వస్తువులను ఏరితీసే ప్రయత్నం చెయ్యకండి. ఒకవేళ ఆ వస్తువులనే ఎవరన్నా మీకు ఇస్తే, వాటిని మీరు తృణీకార భావంతో తప్ప, మనసారా స్వీకరించరు కదా!" (అల్ బఖర : 267)**

**"విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజును స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్ పట్ల ఆయన ప్రవక్త పట్ల విధేయత పాటిస్తారు. వారి మీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు." (తౌబా : 71)**

జకాత్ లేదా తప్పనిసరిగా చెల్లించవలసిన దానం గురించి దివ్యఖుర్‌ఆన్‌లో ఇలాంటి వాక్యాలు అనేకం కనిపిస్తాయి. సమాజంలో దురదృష్టవంతులు, నిర్భాగ్యులైన వారిని ఆదుకోవడానికి దానధర్మాలు చేయాలని ఇస్లామ్ బోధిస్తుంది.

ధనిక బీద తారతమ్యం మునుపెన్నడూ లేనంతగా ఇప్పుడు పెరిగింది. చైనా, భారతదేశాల నుంచి వచ్చిన కొత్త సమాచారం ఆధారంగా వరల్డ్ ఎకానమిక్ ఫోరం లెక్కల ప్రకారం ధనిక బీద వ్యత్యాసం ఇప్పుడు అత్యంత అసభ్యంగా ఉంది. ప్రపంచంలో 360 కోట్ల మంది ప్రజల వద్ద ఉన్న సంపదకు సమానమైన సంపద కేవలం ఎనిమిది మంది వద్ద ఉంది. 2016లో వేసిన లెక్కలు తప్పని కూడా ఆక్స్ ఫామ్ చెప్పింది. 2010లో ప్రపంచంలో యాభైశాతం జనాభా వద్ద ఉన్న సంపద కేవలం 43 మంది మహాధనికుల వద్ద ఉందని నివేదిక వచ్చింది. తర్వాత కేవలం 8 మంది అంత సంపద పొందారని నివేదిక వెల్లడించింది. అంటే ధనిక బీద వ్యత్యాసం నానాటికి పెరుగుతోంది. దీనికి కారణం సంపద పంపిణీ వ్యవస్థ సరిగా లేకపోవడమే.

ఇస్లాములో దానధర్మాలు రెండు రకాలు. ఒకటి తప్పని సరిగా చేయవలసిన దానం. దీన్ని జకాత్ అంటారు. జకాత్ అంటే శాబ్దిక అర్థం శుభ్రం చేయడం. తన వద్ద ఉన్న సంపదలో రెండున్నర శాతం జకాత్‌గా చెల్లించడం ద్వారా సంపదను శుద్ధి చేసుకోవడమే జకాత్. ఇది తప్పనిసరిగా చేయవలసిన దానం. జకాత్ ఎవరికి చెల్లించాలన్నది కూడా నిర్దిష్టంగా ఉంది. రమజాను మాసంలో తప్పనిసరిగా చేసే మరో దానం ఫిత్ర్. రమజాను మాసం తర్వాత ఈద్ పండగ నమాజు కన్నా ముందే ఇది తప్పనిసరిగా చెల్లించాలి. పండగ రోజున పేదసాదలు కూడా ఆనందంగా పండగ చేసుకునే ఏర్పాటిది. ఇవి రెండు తప్పనిసరిగా చేయవలసిన దానాలు. ఇవి కాకుండా సదఖా రూపంలో స్వచ్ఛందంగా చేయవలసిన దానాలను కూడా ప్రోత్సహించడం జరిగింది. అందుకే రమజాను మాసంలో విస్తృతంగా ముస్లిములు దానధర్మాలు చేయడం మనకు కనబడుతుంది.

దానధర్మాలన్న పదాన్ని మనం తెలుగు భాషలో అర్థం చేసుకోడానికి ఉపయోగిస్తున్నాము కాని, నిజానికి ఇస్లామీయ భావన ప్రకారం ఇది ఆర్థిక న్యాయం కోసం ఇచ్చేది. జకాత్ చెల్లించడం ఒక ముస్లిమ్‌పై బాధ్యత అయినప్పుడు పుచ్చుకునే వాడికి అది హక్కు అవుతుంది. అందువల్ల ఇక్కడ ఏదో దయ తలచి ఇవ్వడం అన్న భావన లేదు. ఇవ్వడం తప్పనిసరి. పుచ్చుకునే వ్యక్తి కూడా తన హక్కుగా తీసుకుంటాడే కాని, ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డానని అనుకునేది కాదు. తోటి వారి పట్ల శ్రేయోభిలాష, సానుభూతి, వారి కష్టాలు తమవిగా భావించడం వంటి భావాలు ఇందులో బలంగా ఉన్నాయి.

అంతే తప్ప దానం అంటే ఏదో దయతలచి ఇవ్వడం అన్న భావం లేదు. పైగా సంపద దేవుడు ప్రసాదించింది అన్న సూత్రం ప్రకారం, సంపన్నుడు నిజానికి సంపదకు యజమాని కాదు. దేవుడిచ్చినందువల్ల అతని వద్ద ఉంది. కాబట్టి దేవుడు చెప్పిన పద్ధతిలో దైవప్రసన్నత కోసం ఖర్చు చేయాలి. అందువల్ల అతను దయతలచడం అనేది లేనే లేదు. కాబట్టి సదకాత్ అనే భావన దానధర్మాలు అనే భావనకు విభిన్నమైనది. కాని మనం ఇక్కడ దానధర్మాలన్న పదాలనే సౌలభ్యం కోసం వాడుతున్నాము.

ఆధునిక కాలంలోని ముఖ్యమైన సమస్య ఏమంటే, మనిషికి డబ్బు సంపాదించడం తెలుసు కాని ఖర్చు చేయడం తెలియదు. అందువల్లనే సంపద సమాజంలో పంపిణీ కాదు. దైవ మార్గంలో ఖర్చు పెట్టండని దివ్యఖుర్ఆన్ బోధిస్తుంది. ఫీ సబీలిల్లాహ్.. అంటే దైవమార్గంలో ఖర్చు చేయడం. ఇచ్చింది దేవుడే కాబట్టి ఆయన మార్గంలోనే ఖర్చు చేయాలి. పేదలు, అనాథలు, వితంతువులు, బంధువుల్లో పేదవారు– వీరందరినీ ఆదుకోవాలి.

దివ్యఖుర్ఆన్ ఈ విషయమై ఇలా ఉద్బోధించింది:

**“తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చుచేసే వారి ఖర్చు ఉపమానం ఇలా ఉంటుంది: ఒక్క విత్తనాన్ని నాటితే, అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపచేస్తాడు. అల్లాహ్ అమితంగా ఇచ్చే వాడూ అన్నీ తెలిసినవాడూను. అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని వ్యయంచేసి, ఆ తరువాత తమ దాతృత్వాన్ని మాటి మాటికీ చాటుతూ, గ్రహీతల మనస్సును గాయపరచని వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. వారికి ఏ విధమైన భయం కాని, ఖేదం కాని ఉండవు. మనస్సును గాయపరచే దానం కంటే, మృదుభాషణం, క్షమాగుణం ఎంతో మేలైనవి. అల్లాహ్ అన్నింటికీ అతీతుడు, అత్యంత సహనశీలుడూను. విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా అల్లాహ్‌ను అంతిమదినాన్నీ విశ్వసించని వాని మాదిరిగా, మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దానధర్మాలను మట్టిలో కలప కండి.”**

(అల్ బఖర 261–264)

దానం చేయడం అంటే ఎదుటి వాడికి ఉపకారం చేయడం కాదు, అది పుచ్చుకునేవాడి హక్కు, ఇచ్చేవాడి బాధ్యత అన్న భావన ఇస్లామ్‌లో ముఖ్యమైనది. వివక్ష, పక్షపాతం లేకుండా అధ్యయనం చేస్తే ఇస్లాము నుంచి ప్రపంచం చాలా నేర్చుకో వచ్చు.

**The legislation of Quran will spread all over the world, because it agrees with the mind, logic and wisdom.**

**– Leo Tolstoy**

సమాజంలో సంపద పంపిణీకి ఉద్దేశించిన మెకానిజమ్ జకాత్. నిజానికి ముస్లిములకు జకాత్ ఒక ఆరాధన. ఆర్థిక ఆరాధనగా పరిగణిస్తారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ తన కాలంలో ఎమన్‌కు గవర్నరుగా మాజ్ బిన్ జబల్‌ను పంపించారు. దేవుడొక్కడే. ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త, రోజుకు ఐదు పూటలు నమాజు చేయాలన్న ఇస్లామీయ బోధనలు ఎమన్ ప్రజలకు తెలియజేయాలని, వారు ఈ సందేశాన్ని స్వీకరిస్తే, జకాత్ చెల్లించడం తప్పనిసరని వారికి తెలియజెప్పి, వారి సంపన్నుల నుంచి జకాత్ వసూలు చేసి వారిలోని పేదలకు పంచిపెట్టాలని ఆదేశించారు. ఇస్లామ్ ప్రారంభ కాలంలో జకాత్ ఈ విధంగా అమలయ్యేది. ముస్లిముల్లో ధనికుల నుంచి వసూలు చేసి పేదలకు పంచిపెట్టే వారు. ఆ విధంగా సమాజంలో సంపద పంపిణీ అయ్యేది. ముస్లిమ్ కేలండరులో ఒక్క శతాబ్ది గడిచిన తర్వాత పరిస్థితి ఎలా మారిందంటే, ముస్లిమ్ రాజ్యం అత్యంత సంపన్న రాజ్యంగా నిలదొక్కుకుంది. ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ కాలంలో లిబియా, ట్యూనీషియా ప్రాంతాల గవర్నరు ఖలీఫాకు ఒక లేఖ రాస్తూ, వసూలు చేసిన జకాత్ నిధులు పంపిణీ చేయడానికి పేదలు తమ ప్రాంతంలో లేరని తెలియజేశాడు. ఆ నిధులను గ్రంథప్రజలైన యూదులు, క్రయిస్తవుల్లో పేదలకు పంచాలని ఖలీఫా జవాబు పంపారు. వారిలో కూడా పేదలు లేరని గవర్నరు మళ్ళీ రాశారు. నిజానికి మార్కెట్ ప్రాంతాల్లో జకాత్ నిధులను తీసుకెళ్ళి అవసరమైన వాళ్ళు తీసుకోవచ్చని ప్రకటించినా ఎవరూ ముందుకు రాలేదు. ఇలాంటి సమాజాన్ని, ఇలాంటి శ్రేయో రాజ్యాన్ని ఏర్పరచడమే ఇస్లామ్ లక్ష్యం.

# జకాత్

# ఆధ్యాత్మిక వికాసం... ఆర్థిక న్యాయం




తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్)
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002 ఫోన్: 24564583



మీ సందేహాల నివృత్తికోసం ఈ రోజే మా కాల్ సెంటర్‌కు ఉచితంగా ఫోన్ చేయండి.
Islamic Information Center మా టోల్ ఫ్రీ నెంబర్: 1800 572 3000